'అహో.....' రంగనాధరావు వేదనతో తల విదిలించారు.

పీటర్ చొక్కా ఎత్తి నోట్లో పెట్టుకుని కుడి కన్ను మీద అద్దుకో సాగాడు.

'పీటర్.....పీటర్.....ఈ మధ్య నువ్వు పిస్తోలు తిప్పడం ప్రాక్టీస్ చెయ్యడం లేదా?.... హౌ డిస్ గ్రేస్‌ఫుల్!!.....' రంగనాధరావు బాధగా అన్నాడు.

'చేస్తున్నాను బాస్....కానీ వాళ్లను చూసి కన్‌ఫ్యూజ్ అయిపోయా.....' నసిగాడు పీటర్.

'ఊ.....సరే....పిస్తోలుని పొజిషన్‌లో పట్టుకో .....' అని పీటర్‌ని ఆజ్ఞాపించి వాళ్ళు ముగ్గురివంక చూశాడు రంగనాధరావు.

'చివరిసారిగా మీరు ఏమైనా చెప్పుకోవాల్సి ఉందా?' అడిగాడు.

'ఉంది ....అదీ నీ గురించే' అంది సరోజ.

'నీకు సంబంధించిన రహస్యాలు మేము వేరే వాళ్లదగ్గర పెట్టి వచ్చాం ....మమ్మల్ని చంపుతే నీకే నష్టం ...నీ రహస్యాలు పోలీసుల చేతికి చిక్కుతాయ్.....'

రంగనాధరావు ఖంగు తిన్నాడు.

'నా రహస్యాలా?....ఏంటవి?.....ఎవరి దగ్గర దాచారు?'

'అవి తెలిస్తే మమ్మల్ని వదిలి పెడతావా? వెంటనే చంపెయ్యవూ?'

'ప్లీజ్ ....మిమ్మల్నేమీ చెయ్యను...నా రహస్యాలు నాకు ఇచ్చెయ్యరూ..... మిమ్మల్ని వదిలి పెట్టేస్తాను.....హిహిహుహుహాహ్హో హ్హో హ్హో' బతిమలాడుతూ నవ్వాడు.

'ఒకపక్క బతిమలాడుతూనే ఆ నవ్వేంటి?' విసుక్కుంది సరోజ.

అలవాట్లో పొరబాటైపోయింది....క్షమించండి.'

'నారహస్యాలు నాకప్పచెప్పండి ....హ్హాహ్హా.....' అని మళ్ళీ నవ్వబోయి నోర్మూసుకుని 'సారీ' అన్నాడు.

'అహో.....' బాధగా అరిచాడు రంగనాధరావు.

'పేల్చెయ్యనా బాస్.....' అన్నాడు పీటర్ పిస్తోలు గురిపెడుతూ.

'దీపావళి తుపాకి పేల్చడానికి చిన్నపిల్లాడు సంబరపడ్డట్టు ఏంటాకంగారు....వాళ్లనిప్పుడు చంపుతే మనకే నష్టం .....మనకి సంబంధించిన రహస్యాలు వాళ్ళు ఎక్కడ దాచారో కనుక్కోవాలి!!.... ముందు వీళ్ళని బంధిచండి.....' అన్నడు రంగనాధరావు.

జగ్గూ వీరూలు సరోజ. రాంబాబు, కిష్టయ్యలని స్థంబాలకేసితాళ్ళతో కట్టేశారు.

'బాస్....వీళ్ళు మన రహస్యాలు బహుశా వాళ్ల దగ్గరివాళ్లకే ఇచ్చి ఉంటారు బాస్.....

మనం వాళ్లని కూడా బంధించి తెస్తే సరిపోతుంది.....' అన్నాడు జాకాల్.

'గుడ్ అయిడియా.... వెళ్ళండి ..... కొందరు రాంబాబు ఇంటికి, కొందరు సరోజ ఇంటికి వెళ్ళి అందర్నీ బంధించకు రాండి.....' అన్నాడు రంగనాధరావు.

'బాస్.... రాంబాబుకి ఈ సుబ్బలక్ష్మి తెలుసు, సరోజకి నాగరాజు తెలుసు.....వాళ్లకేమైనా మన రహస్యాలు ఇచ్చారేమో బాస్.....' అన్నాడు జాకాల్ సందేహంగా.

‘వాళ్ళని లాక్కురండి .....’ రంగనాధరావు గట్టిగా అరిచాడు.

జగ్గూ వీరూలు గదిలో బంధించి ఉన్న నాగరాజు సుబ్బలక్ష్మిలను లాక్కునొచ్చాడు.

రాఘవేంద్రరావు వాళ్ళని కూడా తమ రహస్యాలు వాళ్ళకేమైన తెలుసునేమోనని అడిగాడు.

‘మాకేం తెలీదు’ అన్నారు వాళ్ళూ.

‘బాస్ .....ఇందాక వీళ్ళమాటలు బట్టి చూస్తే సుబ్బలక్ష్మి తల్లి దండ్రులు ఈ ఊళ్ళోనే ఉన్నట్లు తెలిసింది.....వాళ్ల దగ్గరేమైనా దాచారేమో......’ అన్నాడు వీరూ గుండు మీద రుద్దుకుంటూ.

‘వెరీగుడ్ .......వాళ్ళిద్దరూ ఎక్కడ ఉన్నారు?’ రంగనాధరావు సుబ్బలక్ష్మిని అడిగారు.

సుబ్బలక్ష్మి వాళ్ళు బసచేసిన హోటల్ పేరు, రూం నెంబరూ చెప్పింది.

‘రౌడీలూ.....మా అమ్మనాన్నలని త్వరగా తీసుకురండి.....మేమెక్కడికెళ్ళి పోయామోనని కంగారు పడ్తుంటారు మమ్మల్ని ఇక్కడ చూసి సంతోష పడ్తారు....హ్హాహ్హాహ్హా......’ అంది సుబ్బలక్ష్మి.

నాగరాజు బిత్తర పోయి సుబ్బలక్ష్మి వంక చూశాడు.

‘ఏంటీ నవ్వు?......’ అన్నాడు గొంతు పెగుల్చుకుని.

ఇంత సేపూ ఈ వెధవల మధ్య ఉండి నాకూ ఈ పాడు నవ్వు అలవాటైపోతూంది......ఛ్ఛీ .....’ అంది సుబ్బలక్ష్మి మొహం చిట్లిస్తూ.

‘హబ్బా!.....’ తల పట్టుకున్నాడు రంగనాథరావు. ‘వీళ్ళెవరికీ మనమంటే బొత్తిగా భయంలేకుండా పోయింది..... రౌడీ వెధవలూ!....... అన్ని మూలలకీ వెళ్ళి అందర్నీ బంధించుకురండి.......మన తడాఖా చూపిద్దాం ..... హిహి హుహు హూ హ్హొ హ్హొ హ్హొ......’

వికటాట్టహాసం చేశాడు రంగనాధరావు.

***అందరూ బందీలే***

ఒక గంటలో రౌడీలు తలో మూలకీ వెళ్ళి రాజశేఖరాన్నీ, రామయ్యాన్ని, పరంధామయ్యా, పార్వతమల్నీ, రాఘవేంద్రరావు వర్ధమ్మల్నీ బంధించి తీసుకొచ్చారు. ఎవర్నేం అడిగినా మాకేం తెలీదంటే మాకేం తెలీదు అన్నారు.

‘హు......వీళ్ళలా వట్టి మాటల్తో చెప్పరు...... వీళ్లందర్నీ తల కిందులుగా వేలాడదీయండి.....’ రంగనాధరావు అరిచాడు.

‘మగాళ్ళని తలకిందులుగా వేలాడదీస్తే తీశావుగానీ మమ్మల్ని తీస్తే మర్యాద దక్కదు.....’ అన్నారు పార్వతి, వర్ధనమ్మలు.

‘మా దగ్గర ఆడా మగా తేడాలేదు...... అందర్నీ తలకిందులుగా వేలాడ దియ్యండి రా..... హ్హాహ్హాహ్హా......’

‘నీ జిమ్మడ ....నీ చేతులిరిగిపోనూ.....’

'పాపిష్ఠి వెధవా ....వెధవా నవ్వా నువ్వాను.... నవ్వకుండా నీ పూడుకుపోనూ .....నీ కాళ్ళూ పడిపోనూ....'

'నీ నోరు పడిపోనూ.....'

'నీ తల పగిలిపోనూ.....'

పార్వతి, వర్ధనమ్మ వంతులవారీగా నాన్‌స్టాప్‌గా శాపనార్థలు పెట్టసాగారు.

రంగనాధరావుకి వాళ్ళు తిట్టే తిట్లకి తల తిరిగిపోయింది. రెండు చేతుల్తో చెవులు మూస్కున్నాడు.

'హు......దేనికైనా భయపడనక్కర్లేదుగనీ ఈ ఆడవాళ్ల నోటికి మాత్రం భయపడాలి .....రాబర్ట్.......పీటర్......జగ్గూ......వీరూ.......' గట్టిగ అరిచాడు.

'యస్ బాస్....అన్నారు వాళ్ళు.

'ఈ ఆడాళ్లతో మనం పడలేం గానీ ....వాళ్లని మామూలుగానే వెళ్లాడకట్టండి.....'

'యస్ బాస్.....'

'మమ్మల్ని కూడా మామూలుగానే వేళ్ళాడగట్టండి బాబూ......ప్లీజ్ బాబూ.....మేము మీకు అతిథులం బాబూ...... అలా చెయ్యకూడదు బాబూ....నామాట వినండి బాబూ.....ప్లీజ్ బాబూ..... ' అన్నాడు రామయ్య.

తలకిందులుగానే కాదు..... అస్సలు వేలాడ గట్టొద్దు అని అడగాలిగానీ ఏంటా దిక్కుమాలిన తెలివితేటలూ నువ్వానూ?.....' రామయ్యని కోప్పడ్డాడు రాజశేఖరం.

'అయినా మాకే వ్యవహారం తెలీదంటుంటే మమ్మల్ని తలకిందులుగా వేలాడ గట్టమంటా వేంటయ్యా ......నీ వ్యవహారం మాకేం నచ్చలేదు....' అన్నడు పరంధామయ్య కోపంగా.

'వేలాడగడ్తే కట్టారుగానీ నన్నెవరైనా ఉయ్యాల ఊపినట్టు ఊపండి.... అలాగేనా?' సంబరంగా అన్నాడు కిష్టయ్య.

ప్లీజ్ బాబూ..... తప్పుబాబూ.... అలా వేళ్లాడగట్టకూడదు బాబూ..... మేము మీకు అతిథులం బాబూ.....'

'దిక్కుమాలిన మేళం మధ్యలోవచ్చి పడ్డా..... దిక్కుమాలినసంత.....'

'ఇలాంటి దరిద్రపు వ్యవహారం నేనెక్కడా చూళ్లేదు.....'

'నీ చేతులిరగా.....'

'నీ కాళ్ళు విరగా......'

రంగనాధరావు ఫెల్ట్‌హ్యాట్ తీసి జుట్టు పీక్కున్నాడు.

ఓహ్!..... ...... నేనీ బాధ భరించలేను...... వెంటనే వీళ్లందర్నీ వేళ్ళాడదీయండి' పిచ్చెక్కినట్టు గట్టిగా అరిచాడు.

'ప్లీజ్ బాబూ...... మేము మీకు అతిథులం బాబూ....మీరేమీ మాకు కాఫీలూ టిఫిన్లూ ఇవ్వనక్కర్లేదు బాబూ....మమ్మల్ని వేలాడ దీయకుండా ఉంటే అంతే చాలుబాబూ..... ప్లీజ్

బాబూ' వినయంగా అర్థించాడు రామయ్య.

'ముందు వీడు మాటిమాటికీ ప్లీజ్ బాబూ అని అనకుండా నోట్లో గుడ్డలు కుక్కి తరువాత వేలాడదీయండి....హా.....' జుట్టు పీక్కున్నాడు రాంగనాథరావు.

'ప్లీజ్ బాబూ.... అలా అనొద్దు బాబూ.....'

'హబ్బా....... త్వరగా నోట్లో గుడ్డలు కుక్కండి.....'

రామయ్య నోట్లో గుడ్డలు కుక్కాడు వీరూ.

వాళ్లందర్నీ పైనుండి తాళ్లతోకట్టి వేళ్ళాడదీశారు.

ఇప్పటికైనా చెప్తారా?.... మీలో ఎవరి దగ్గర మాకు సంబంధించిన రహస్యాలు ఉన్నాయ్.... ఏంటా రహస్యాలు?" అందర్నీ ఉద్దేశించి అడిగాడు రంగనాథరావు.

ఎవ్వరూ ఒక్కమాటకూడా మాట్లాడలేదు.

రామయ్య మాత్రం చేత్తో సైగచేశాడు.

"వాడేదో చెప్పాలని అనుకుంటున్నాడు. నోట్లోని గుడ్డలు తీయండి......"

వీరూ రామయ్య నోట్లోని గుడ్డలు తీశాడు.

"ప్లీజ్ బాబూ.... ఇలా వేలాడగట్టకూడదు బాబూ.... మేము మీకు అతిథులమ బాబూ.... ప్లీజ్ బాబూ...." అన్నాడు రామయ్య.

"సర్లెసర్లె.... నోట్లోని గుడ్డలు తియ్యమన్నావ్ నీకు మా గురించిన రహస్యాలు తెల్సా?" విసుక్కుంటూ అడిగాడు రంగనాథరావు.

"లేదు బాబూ...... మికీ విషయం చెప్దామనే గుడ్డలు తీయమన్నాను బాబూ.... ప్లీజ్ బబూ.... మీ అతిథులం బాబూ.....మాకేం కాఫీ టిఫిన్లు ఇవ్వనక్కర్లేదు బాబూ...."

"హబ్బా.... వీడి నోరు మూసేయండి...." అరిచాడు రంగనాథరావు.

వీరూ మళ్ళీ రామయ్య నోట్లో గుడ్డలు కుక్కేశాడు.

"చెప్పండి .... ఎవరి దగ్గర ఉన్నాయ్ మా రహస్యాలు?" రంగనాథరావు అందరి వంకా చూసి ప్రశ్నించాడు.

ఎవ్వరూ మాట్లాడలేదు.

"జాకాల్.... వాళ్ళ కింద మంటలు పెట్టండి...." గద్దించాడు రంగనాథరావు.

"యస్ బాస్...."

వేళ్ళాడుతున్న అందరి కింద మంటలు పెట్టారు.

"దిక్కు మాలిన మంట పెడ్తే పెట్టారుగానీ వెచ్చగా హాయిగా ఉంది" మెచ్చుకుంటూ అన్నాడి రాజశేఖరం.

"మంట కాస్త ఎక్కువ సేపు ఉంచు బాబూ నీ కడుపు చల్లగా...." అంది వర్ధనమ్మ.

"నన్ను ఎవరైనా కాస్త ఊపరా??" అన్నాడు కిష్టయ్య.

"ఒరేయ్ గుండెదవా.... నా వీపు మీద దురద పుడ్తుంది కాస్తగోకు" అన్నాడు రాంబాబు

వీరూతో.

"మనం ఇక్కడి నుండి తప్పించుకుని పారిపోయాక నువ్వు నన్ను పెళ్ళి చేస్కుంటావు కదూ?.... మాట తప్పవు కదూ?" సుబ్బలక్ష్మి నాగరాజుని అడిగింది.

"ఊహూ.... తప్పను. ఇక్కడినుండి తప్పించుకుని వెళ్ళిన వెంటనే మన పెళ్ళి జరుగుతుంది.... సరేనా?" అన్నాడు నాగరాజు.

"మరి మన పెళ్ళెప్పుడో?.... " సరోజ ఓరగా చూస్తూ అడిగింది.

రాంబాబు తలకిందులుగా సిగ్గుపడ్డాడు.

"అంతా వాళ్ళిష్టమేనా.... నా అభిప్రాయంతో పనిలేదా?.... వీళ్ళ వ్యవహారం నాకేం నచ్చలేదు.... నేనొప్పుకోను..." అవేశంతో తాడు కదిలి పరంధమయ్య ఉయ్యాల్లా ఊగసాగాడు.

"అర్రే! .... మీరెలా ఊగుతున్నారూ.... నేను ఊగుతా...." అన్నాడు కిష్టయ్య అటూ ఇటూ కదుల్తూ.

"హా...." బాధతో ఆర్తనాదం చేశాడు రంగనాథరావు.

"వీళ్ళతో ఇక లాభంలేదు బాస్.... ఎట్లాగూ వీళ్ళలో ఒకరి దగ్గర మన రహస్యాలు ఉన్నాయ్... వీళ్ళందర్నీ షూట్ చేస్తే రహస్యం ఇక్కడే సమాధి అయిపోతుంది...." అన్నాడు జాకాల్.

"ఒరేయ్!.... ఆ మంటలు ఆర్పి వాళ్ళని కిందకి దింపి వర్సగా నిలబెట్టండర్రా...." ఆజ్ఞాపించాడు రంగనాథరావు.

"యస్ బాస్..." అంటూ జగ్గూ వీరూలు మంట ఆర్పి అందరి కట్లు విప్పి కింద వర్సగా నిలబెట్టారు.

"పీటర్!.... షూట్ దెమ్ ఆల్...." గట్టిగా అరిచాడు రంగనాథరావు .

"హ్హాహ్హాహ్హా ...." నవ్వుకుంటూ వాళ్ళముందుకు వచ్చి పిస్తోలుని గిరగిరా తిప్పుతూ మళ్ళీ పొరబాటున కన్నుమీద కొట్టుకున్నాడు పీటర్.

"హబ్బా...." కన్ను మీద చెయ్యి పెట్టుకుని బాధగా అరిచాడు పీటర్.

" నీ దరిద్రపు విద్యలు వాళ్ళకేమీ ప్రదర్శించనక్కర్లేదు... ముందు వాళ్ళని షూట్ చెయ్యి" కోపంతో వణికిపోయాడు రంగనాథరావు.

పీటర్ తుపాకి వాళ్ళకి గురిపెట్టాడు.

"కాచుకోండి.... రెడీ.... వన్.... టూ.... త్రీ...."

తుపాకి పేలలేదు గానీ పీటర్ చేతిలోంచి అంతదూరం ఎగిరి పడింది.

పీటర్‌చేయి చూసుకుంటూ బాధతో గంతులేశాడు.

"హ్హాహ్హాహ్హా...." ఎవరో పకపకా నవ్వారు.

అందరూ ఆ నవ్వు వినవచ్చిన దిక్కుకి చూశారు.

మెట్లమీద భీమేశ్వరరావు ఉండేలు బద్దపట్టుక్కుని నవ్వుతున్నాడు. దాంతో అతను పీటర్

చేతులోని పిస్తోలుని ఎగరగొట్టింది.